క్లుప్తంగా

కొత్తవలసలో దొంగల అలజడి

కొత్తవలస: మండలంలోని అడ్డూరివానిపాలెం గ్రామంలో ఆదివారం రాత్రి నాలుగిళ్లలో దొంగలు చోరీకి యత్నించారు. ముందుగా అడ్డూరివానిపాలెం గ్రామంలో అరకు–విశాఖ రోడ్డును ఆనుకుని ఉన్న మూడిళ్లకు తలుపులు, గేట్లకు ఉన్న తాళాలు విరగ్గొట్టి దొంగలు ఇళ్లలో ప్రవేశించి వస్తువులను చిందరవందర చేశారు. అక్కడ ఏమీ దొరక్కపోవడంతో గ్రామంలోకి వచ్చి అడ్డూరి గౌరినాయుడు ఇంటికి వెళ్లారు. ఇంట్లో గౌరినాయుడు, భార్య సరస్వతి, పిల్లలు నిద్రిస్తున్నారు. ఇంటికి వెనుకవైపు గల కిటికీ గ్రిల్స్‌ను స్క్రూడ్రైవర్‌తో విరిచి చెంతనే గల తుప్పల్లో పారేసి ఇంటిలోకి ప్రవేశించారు. నిద్రిస్తున్న సరస్వతి మెడలో గల రెండున్నర తులాల బంగారం తాడును కత్తిరించారు. అలాగే డ్రెసింగ్ టేబుల్ డెస్క్‌లో రూ. 4వేలు, పడక గదిలో గల బ్యాగ్‌లో ఉంచిన రూ.5వేల నగదు పట్టుకుపోయారు. ఇంట్లో ఇంత జరిగినా ఒక్కరికీ మెలకువ రాకపోవంతో వారిపై ఏవైనా మత్తు పదార్థాలు చల్లి చోరీకి పాల్పడ్డారా? అని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్సై వీరజనార్దన్ సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. అనంతరం విజయనగరం నుంచి క్లూస్‌టీమ్ వచ్చి వేలిముద్రలు సేకరించింది. బాధితుడు గౌరినాయుడు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థినులకు కళ్లద్దాల పంపిణీ



విద్యార్థినులకు కళ్లద్దాలు అందజేస్తున్న వైద్యసిబ్బంది, ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్‌పాత్రో

లక్కవరపుకోట: జమ్మాదేవిపేట జ్యోతీరావు పూలే బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన 25 మంది విద్యార్థినులకు సోమవారం కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఇటీవల గ్రామంలో నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' మెడికల్ క్యాంపులో వైద్యులు విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి, కళ్లద్దాలు అవసరమైన వారిని గుర్తించారు. వీరికి ప్రభుత్వం సమకూర్చిన కళ్లద్దాలను వైద్య సిబ్బంది అందజేశారు. ప్రిన్సిపాల్ యు.విజయ్‌కుమార్‌పాత్రో పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే అభివృద్ధి



ఉసిరి చెట్టు వద్ద పూజలు చేస్తున్న నాయకులు, గ్రామస్తులు

గుర్ల: ప్రజలు ఐకమత్యంగా ఉన్నప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.వి.సూర్యనారాయణరాజు,పొట్నూరు సన్యాసినాయుడు అన్నారు. జమ్ముపేట శివారులో సర్పంచ్ వరలక్ష్మి ఆధ్వర్యంలో ఆగ్రామస్తులు సోమవారం కార్తీక వనమహోత్సవం నిర్వహించారు. మండల వైఎస్సార్‌సీపీ నాయకులు అతిథులుగా హాజరయ్యారు. గ్రామస్తులు ఉసిరి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం వనభోజనాలు చేశారు. మండల జేసీఎస్ కన్వీనర్ బెల్లాన బంగారునాయుడు, జమ్ముపేట పీఏసీఎస్ చైర్మన్ కురుమునెల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి



విద్యార్థులకు వివేకానంద జీవితచరిత్ర పుస్తకాలు అందజేస్తున్న ఆశయ రమణ

చీపురుపల్లిరూరల్: ప్రతీ విద్యార్థి స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని ఆశయ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ అన్నారు. పుర్రేయవలస ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వివేకానంద జీవితచరిత్ర పుస్తకాలను సోమవారం అందజేశారు. జనవరి– 12న వివేకానంద జయంతి సందర్భంగా అదే రోజు ఆయన జీవిత చరిత్రపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు రమణ తెలిపారు.

నేడు సోషల్ మీడియా కార్యకర్తల సమావేశం

చీపురుపల్లి: నియోజకవర్గ జగనన్న కనెక్ట్ సోషల్‌మీడియా ఆత్మీయ సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ చీపురుపల్లి మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు సోమవారం ఓ ప్రకటనలోతెలిపారు. గరివిడి సీతారామ కల్యాణ మండపంలో మధ్యాహ్నం 3గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి జిల్లా పార్టీ అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు,ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఐప్యాక్ టీమ్ హాజరవుతారని పేర్కొన్నారు. నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

హెచ్‌ఎంలకు శిక్షణ

గజపతినగరం: విద్యార్థుల అభ్యసనస్థాయి పెంపుపై మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు స్థానిక బాలుర హైస్కూల్‌లో సోమవారం శిక్షణ ఇచ్చారు. ఎంఈఓ విమలమ్మ హాజరై పలు సూచనలు చేశారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ఉత్తీర్ణత శాతం పెంచేలా కృషి చేయాలన్నారు. ఎంఈఓ–2 సాయిచక్రధర్ పాల్గొన్నారు.

శంభో.. శివ శంభో



వేపాడ: బొద్దాం ఉమాబ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కార్తీకమాసంలో ఆఖరి సోమవారం కావడంతో గజపతినగరం, ఎస్.కోట, చీపురుపల్లి నియోజకవర్గాల్లోని శివాలయాలు భక్తుల శివనామ స్మరణతో మారుమ్రోగాయి. వేకువ జాము నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అర్చకులు భక్తులతో శివలింగాలకు అభిషేకాలు, పూజలు చేయించారు. ఆలయాల్లో ధ్వజస్తంభాలు, తులసి కోటలు, రావి, ఉసిరి చెట్ల వద్ద మహిళలు దీపారాధన చేశారు. పలుగ్రామాల్లోని ఆలయాల వద్ద ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.

– గజపతినగరం/బొండపల్లి/జామి/దత్తిరాజేరు/గుర్ల/వేపాడ/ కొత్తవలస/లక్కవరపుకోట



లక్కవరపుకోట: లింగంపేట శివాలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



కొత్తవలస: తుమ్మికాపల్లిలోని ఓం సదనంలో 108 శివలింగాలకు రుద్రాభిషేకం చేస్తున్న వేద పండితులు



జామి: జామిలో త్రిపురాంతకస్వామికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు



బొండపల్లి: గెద్దపేటలో భక్తులతో కిటకిటలాడుతున్న శివాలయం



గజపతినగరం: దర్శనం కోసం గజపతినగరం శివాలయంలో క్యూలో ఉన్న భక్తులు



గుర్ల: గుర్ల శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



దత్తిరాజేరు: పెదకాద శివాలయంలో భక్తుల పూజలు



గజపతినగరం: గజపతినగరం శివాలయంలో అభిషేకాలు చేస్తున్న అర్చకులు



వేపాడ: సోంపురంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు



లక్కవరపుకోట: ఎల్.కోటలోని వీరభ్రస్వామిఆలయంలో రుద్రాభిషేకం చేస్తున్న పురోహితులు



కొత్తవలస: తుమ్మికాపల్లి శివాలయంలో పూజలు భక్తులు

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం



బొండపల్లి: గరుడుబిల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ చలం నాయుడు, జెడ్పీటీసీ సూర్యప్రకాశరావు



చీపురుపల్లిరూరల్(గరివిడి): కోనూరులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు అప్పలనాయుడు, సర్పంచ్ శ్రీరాములనాయుడు

బొండపల్లి: మండలంలోని గరుడుబిల్లి, రాచకిండాం రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీపీ చల్లా చలం నాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మద్దతు ధర చెల్లించి రైతుల నుంచి ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేసేలా ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుందని చెప్పారు. మిల్లర్ల నుంచి రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవ్వకుండా వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొద్దల చిన్నంనాయుడు, ఏఓ పి.వి.మల్లికార్జునరావు, రాచకిండాం పీఏసీఎస్ చైర్మన్ గొల్లు సతీష్, నాయ కులు పెద్దమజ్జి గోపి, భోపారపు శ్రీను, సిరిపురం నాయుడుబాబు, చొక్కాకు నారాయ ణరావు, లెంక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తాం

చీపురుపల్లిరూరల్(గరివిడి): ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతుల నుంచి ప్రభుత్వం ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తుందని గరివిడి మండలంలోని కోనూరు పీఏసీఎస్ అధ్యక్షుడు ఎలకల అప్పలనాయు డు, స్థానిక సర్పంచ్ బూడి శ్రీరాముల నాయుడు అన్నారు. పీఏసీఎస్ వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం వారు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తుఫాన్ కార ణంగా దెబ్బతిన్న ధాన్యానికి సంబంధించి ఎలాంటి తేమశాతం చూడకుండా రైతుల నుంచి కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. గోనె సంచులు,వాహనాల రవాణా చార్జీలను రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమచేయనుందని చెప్పారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేడు దత్తిరాజేరులో ప్రారంభం

దత్తిరాజేరు: మండల కేంద్రంలోని రైతుభరోసా కేంద్రం వద్ద మంగళవారం ఉదయం ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించనున్నట్లు ఏఓ అనురాధ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరై, కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' ఓ సువర్ణవకాశం



కొత్తవలస: సచివాలయాల కార్యదర్శులకు క్రీడా పరికరాలు అందజేస్తున్న ఎంపీపీగోపెమ్మ, జెడ్పీటీసీ శ్రీదేవి



బొండపల్లి: క్రీడా పరికరాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ చలంనాయుడు, జెడ్పీటీసీ సూర్యప్రకాశరావు

కొత్తవలస: గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్రా' క్రీడాటోర్నమెంట్ నిర్వహిస్తోందని, క్రీడాకారులుగా ఎదగాలనుకునే యువతకు ఇది ఓ సువర్ణవకాశం అని ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ అన్నారు. సచివాలయాల స్థాయిలో క్రీడా టోర్నమెంట్ నిర్వహణకు అవసరమైన క్రీడా పరికరాలను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని సచివాలయాల కార్యదర్శులకు జెడ్పీటీసీ నెక్కల శ్రీదేవితో కలిసి సోమవారం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 15 ఏళ్లు దాటిన మహిళలు, పురుషులకు వేర్వేరుగా ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని, పోటీ ల్లో ఎక్కువ మంది పాల్గొనేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఎంపీడీఓ వై.పద్మజ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

బొండపల్లి: సచివాలయాల స్థాయిలో ఈనెల 15న ప్రారంభంకానున్న 'ఆడుదాం ఆంధ్రా' క్రీడాటోర్నమెంట్‌ను అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయాల సిబ్బంది విజయవంతం చేయా లని ఎంపీపీ చల్లా చలం నాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్య ప్రకాశ రావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని సచివాలయాల కార్యదర్శులకు 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా టోర్నమెంట్ నిర్వహణ కోసం క్రీడా పరికరాలు సోమవారం పంపిణీ చేశారు. ఎంపీడీఓ కార్యాలయ ఏఓ డి.వెంకటరమణ, ఈఓపీఆర్డీ సుగుణాకరరావు తదితరులు పాల్గొన్నారు.

2వేల మందికి దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీచైర్మన్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కడుబండి

జామి: మండల కేంద్రంలో దేవాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సుమారు 2వేల మందికి జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎస్. కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు దుప్పట్లు సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఏటా దేవాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బసవేశ్వర గఫారాధన కార్యక్రమం నిర్వహించడం, అందులో భాగంగా పేదలకు వస్త్రాల పంపిణీ, అన్నసమారాధన చేస్తుండడం అభినందనీయమన్నారు. అంతకు ముందు బసవేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నదానం చేశారు. డీసీసీబీ చైర్మన్ వేచలపు చినరామునాయుడు, జెడ్పీటీసీ గొర్లె సరయు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవి కుమార్, డీసీసీబీ డైరెక్టర్ పాండ్రంకి సంజీవి, రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ చలుమూరి సత్యారావు, స్థానిక సర్పంచ్ చిప్పాడ లక్ష్మి, ఉప సర్పంచ్ అల్లు పద్మ, మండల దేవాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆంధ్ర గోపాలకృష్ణ, వస్త్ర వ్యాపార వేత్తలు గోరు రామారావు, ఉప్పు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త నర్సింహమూర్తి

బొండపల్లి: పండ్ల తోటల సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల అధిక దిగుడులు సాధించవచ్చని కడప వైఎస్సార్ వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ నర్సింహమూర్తి అన్నారు. ఏపీ సమీకృత సాగునీ రు, వ్యవసాయ పరివర్తన పథకంలో భాగంగా జిల్లా ఉద్యానవన శాఖ సౌజన్యంతో స్థానిక రైతుభరోసా కేంద్రంలో మామిడి సాగుపై రైతులకు సోమవారం శిక్షణ ఇచ్చారు. మామిడి పూత, పిందె దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు సస్యరక్షణ, సమగ్ర యాజమాన్య పద్ధతులను వ్యవసాయ శాస్త్రవేత్త వివరించారు. స్పింకర్లు,డ్రిప్ పరికరాల ద్వారా మొక్కలకు నీటిని, పురుగు మందులు అందించడం ద్వారా పెట్టుబడులు తగ్గుతాయని చెప్పారు. హెచ్ఓ ఏ.రాజశేఖర్, ఐఆర్‌పీడబ్ల్యుఎస్ డైరెక్టర్లు ప్రకాష్, పట్నాయిక్, ఏఓ పి.వి.మల్లికార్జునరావు, ఏఈఓ సంతోష్‌కుమార్, సర్పంచ్ బొండపల్లి ఈశ్వరరావు, ఎంపీటీసీ బండారు శ్రీను, ఉప సర్పంచ్ కోళ్ల వెంటకరమణ, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలకు వంటపాత్రల అందజేత



వంట నిర్వాహకులకు వంట పాత్రలు అందజేస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీరాములు, ఉపాధ్యాయులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కాపుశంబాం ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం నిర్వహణకు ప్రభుత్వం వంట పాత్రలు సమకూర్చింది. వీటిని పథకం నిర్వాహకులకు ఆ గ్రా మ పీఏసీఎస్ అధ్యక్షుడు లెంక శ్రీరాములు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహ కులకు సూచించారు. హెచ్‌ఎం డి.రాము, ఉపాధ్యాయులు బి.పావని, బి.అనంతరావు ,సింహాచలం, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు కె.రేవతి, ఎల్.నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆటో యాత్రకు మద్దతు



ప్రజాచైతన్య యాత్రకు మద్దతు తెలుపుతున్న ఎంపీపీ చలంనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు సూర్యప్రకాశరావు, నాయకులు

బొండపల్లి: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి వచ్చే ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ కావూరి జయకుమార్ చేపట్టిన ప్రజాచైతన్య ఆటో యాత్ర సోమవారం బొండపల్లి మండల కేంద్రానికి చేరింది. యాత్రకు ఎంపీపీ చల్లా చలంనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు రాపాక సూర్యప్రకాశరావు, నాయకులు స్వాగతం పలికి మద్దతు తెలిపారు. యాత్రను సెప్టెంబర్ 12న ఇడుపులపాయలో ప్రారంభమైందని, ఈ నెల 21న ఇచ్ఛాపురం వద్ద ముగియనుందని తెలిపారు.

పేదల సంక్షేమమే పరమావధి



శృంగవరపుకోట: ముషిడిపల్లిలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



కొత్తవలస: వియ్యంపేటలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ గోపెమ్మ, జెడ్పీటీసీ శ్రీదేవి



చీపురుపల్లిరూరల్: గరివిడి మండలం శివరాంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తున్న నాయకులు



గుర్ల: గుజ్జింగివలసలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ అప్పలనాయుడు, నాయకులు



చీపురుపల్లిరూరల్: పర్లలో ఇంటింట ప్రచారం చేస్తున్న ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు



లక్కవరపుకోట: రెల్లిగౌరమ్మపేటలో మాట్లాడుతున్న ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు



బొండపల్లి: కనిమెరకలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ చలంనాయుడు, జెడ్పీటీసీ సూర్యప్రకాశరావు తదితరులు



దత్తిరాజేరు: వి.కృష్ణాపురంలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు, తదితరులు



గంట్యాడ: పెంటశ్రీరాంపురం సభలో మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి



జామి: అలమండ సచివాయం-2 వద్ద పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సరయు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రవికుమార్



వేపాడ: కొండగంగుబూడిలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సత్యవంతుడు, తదితరులు

పేదల సంక్షేమమే పరమావధిగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, పలువురు ప్రజాప్రతినిధులు అన్నారు. శృంగవరపుకోట మండలంలోని ముషిడిపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన 'ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమానికి ఎమ్మెల్యే కడుబండి హాజరయ్యాయా. అలాగే కొత్తవలస మండలంలోని వియ్యంపేట, ఎల్.కోట మండలంలోని ఆర్.జి.పేట, దత్తిరాజే రు మండలంలోని వి.కృష్ణాపురం, గుర్ల మండలంలోని గుజ్జింగివలస, జామి మండలంలోని అలమండ, వేపాడ మండలంలోని కొండగంగుబూడి, గంట్యాడ మండలంలోని పెంటశ్రీరాంపురం, చీపురుపల్లి మండలంలోని పర్ల, గరివిడి మండలంలోని శివరాం, బొండపల్లి మండలంలోని కనిమెరక గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు. ఆయా సచివాలయాల పరిధిలో ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం వెచ్చించిన నిధుల వివరాలతో కూడిన బోర్డులను సచివాలయాల వద్ద ఆవిష్కరించారు. గ్రామాల్లోని ప్రైవేటు స్థలాల్లో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు.వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించారు.

– సాక్షి, నెట్‌వర్క్